

రైలు ప్రయాణం చేసినంతసేపూ కమల హృదయంలో ఆనందం, ఆత్రుతా, ఉత్సాహం పొంగాయి. సూర్యాస్తమాన మయింది. మరి కొద్ది సేపట్లో పౌర్ణమిచంద్రుడు ఉదయించాడు. పరవళ్ళుతొక్కుతూ ప్రవహించే గోదావరీనదీమతల్లి చిరుకెరటాలలో మల్లెపూలలాంటి వెన్నెల చిందులు తొక్కుతున్నది. కిటికీదగ్గరగా కూర్చుని మోచెయ్యి కిటికీ కానించి అరచేయి గడ్డంక్రింద పెట్టుక అరమోడ్పుకన్నులతో ప్రవాహాన్ని తిలకిస్తూ కూర్చుంది. ఎన్నివేల సంవత్సరాలనాటిదో ఈ గోదావరి. కొండలుతొల్చి శిలల నునుపుతేర్చి అరమరలు లేకుండా కొన్నివందల మైళ్ళు ప్రవహిస్తూ సముద్రాభిముఖమై సాగిపోతున్నది. అటువంటి చిత్రనదీ సైకతస్థలాలదాపుగా కాపురం వుండబోతున్నది కమల. ఆమె గర్వంగా తనలో తను నవ్వుకుంది. గోదావరిని చూసి, ఆమెగర్వానికి కారణం తను బాగా చదువుకున్నానని కాదు. రేపట్నుంచి ప్రతినిత్యమూ గోదావరి స్నానంచేస్తూ, ప్రకృతిశోభను తిలకిస్తూ ఆనందంగా జీవితం గడపొచ్చునని ఉవ్విళ్ళూరింది. ఆమె మెదడులో మెదలేభావాలకు అంతులేదు. జ్యోత్స్నానందంతో హృదయం నిండిపోయింది. కమల అత్తవారింటికి వెళుతున్నది, తొలిసారి.

"అమ్మా స్టేషనొచ్చింది దిగుదాం లే" అన్నాడు తండ్రి. ఏమిటో ఆలోచిస్తున్న కమల ఉలికిపడి లేచింది. తండ్రితోకూడా గోదావరిస్టేషనులో దిగింది. జట్కాబండి పరుగెత్తుతున్నకొద్దీ ఆమెహృదయం కంగారుపడసాగింది. బండి ఆగింది "ఇదే తల్లీ ఇల్లు, దిగు" అన్నాడు తండ్రి. ఆమె బండి దిగింది. పెదవులపై చిరునవ్వు పాకగా సిగ్గుతో పమిటచెంగు నోటికడ్డంపెట్టుకుని మిలమిలా మెరిసేకళ్ళతో ఓసారి గుమ్మంవైపు చూసింది. బండిచప్పుడుకు ఇంట్లోవారంతా బయటికి వచ్చారు. అందర్నీ ఒక్కసారి తేరిపార చూసింది.

"వదినొచ్చింది వదినొచ్చింది" అంటూ చిన్నాడబడుచు చప్పట్లు చరిచింది.

"వదినా నాకేం తెచ్చావ్" అంటూ చిన్నమరిది దగ్గర కొచ్చాడు.

'ఈనాలుగు నెల్లలో కాస్త పుంజుకొన్నావే' అన్నది పెద్దాడబడుచు, చంకలోవున్న కొడుక్కు గోరుముద్ద కలిపిపెడుతూ.

"నగలేం చేయించుకొన్నావ్, వదినా?" అని ఆవిడే మళ్ళీ అడిగింది.

"నేను కొంచెం కర్చులోవుంటంనుంచి ఇంకా దానిడబ్బు ఇవ్వలేకపోయినానమ్మా. ముందునాటి కిస్తా" అన్నాడు కమలతండ్రి, బండివాడికి డబ్బుయిస్తూ.

వీరందరిలో ఒకవ్యక్తి కనబడలేదు కమలకి. ఆమెచిరునవ్వు సన్నగిలింది. అత్తగారు పెదవివిరిచి పెదిమవిప్పకుండా పెరట్లోకి వెళ్ళిపోయింది, వియ్యంకు డన్నమాట విని. తండ్రీ కూతుళ్ళిద్దరూ లోపలికి వెళ్ళారు. పెద్దాడబిడ్డ తెచ్చిచ్చిన నీళ్ళతో కాళ్ళు కడుక్కున్నారు. కమలను పిల్చి

బి. యస్. ఆర్. కృష్ణారావు

తండ్రి ఏదో సంజ్ఞ చేశాడు. ఆవ్యక్తికోసం ఇల్లంతా చూసింది-కనబడలేదు. పెరట్లోకి వెళ్ళింది; తను వెతుకుతున్న వ్యక్తి వెనక వసారాలో మూతి ముడుచుకొని కూర్చొనుంది; ఒక నులకకుక్కిలో. కొట్టుకుంటూన్న గుండెల్ని చిక్కబట్టుకుని పాదాలనుస్పృశించి కళ్ళకద్దుకుంది. ఆకాళ్ళుకదిలాయి. పులిని చూసిన లేడివలె వెనుకంజవేసింది కమల. నల్లమబ్బులచాటుమాటు మణిగిన చంద్రబింబంలా వైవర్ణ్యంపొందగా నిశ్చేష్టఅయి అట్లాగే నిల్చింది. అత్తగారి పెదవులు చలించాయి.

“నాకెందుకే దండం! క్రియ శూన్యంగాని మర్యాదలకు అంతులేదు. కొనాలా పెట్టాలా! మనిషికోమాట, గొడ్డుకోదెబ్బ. చాల్లే వెళ్ళు అవతలకి” అన్నది కళ్ళు చింతనిప్పులుకక్కుతూ. కమల హృదయం బల్లెం గుచ్చుకున్నట్లయింది. గుడ్లనీళ్ళుకుక్కుకుని ఏకాయెకిని తండ్రిదగ్గరకు వెళ్లింది. ఉబికి ఉబికి వచ్చే దుఃఖతరంగాలో అన్నట్లుగా కన్నీళ్ళుకారుస్తూ తండ్రి ఒడిలో తల పెట్టి నాన్నా “నేనేంపాపం చేశాను!” అని బావురుమని యేడ్చింది.

మెడమీద రెండు వేడి కన్నీటిచుక్కలు పడటం కమల గమనించకపోలేదు. కూతుర్ని వెంటబెట్టుకుని ఉత్తరీయంతో కళ్ళొత్తుకుని దొడ్లో పంచలోకి వెళ్ళాడాయన. పాతికేళ్ళనుండీ నౌకరీచేస్తూ అయిదారు సంవత్సరాలనుంచీ హెడ్ గుమాస్తాగా చేస్తూ ఏ రోజునా ఏ విషయంలోనూ అధికారిచేత మాటపడకుండా నిభాయించుకు వస్తున్నాడు. ఈనాడు ఒక ఆడదానిదగ్గర, అధికారిముందునిల్చున్న తాకీదారువలె నిల్చుని భయపడుతూ మాట్లాడవలసివచ్చినందుకు ఆయన హృదయం ఎంతక్షోభిల్లిందో ఆ పరమాత్ముడికెరుక. కన్నబిడ్డ; చిన్నప్పటినుంచీ అల్లారుముద్దుగా పెంచి పెద్దదాన్ని చేశాడు. పదిహేనేళ్లు పెంచాడు. రక్తసంబంధం ముందుస్వాభిమానాన్ని అణచిపెట్టుకోవలసివచ్చింది. దయాభిక్షకోసంనిల్చున్న దోషిని న్యాయమూర్తి చూసినట్టుగా చూసింది, అత్తగారు కొంగు. బుర్రమీదికి లాక్కుంటూ. తండ్రీ కూతుళ్ళగుండెలు గతుక్కుమన్నాయి.

“వదినగారూ! ఒక్కమాట ఆలకించండి. కొద్దినెలల్లో వడ్డీతోసహా అంతసొమ్మూ ఇచ్చేస్తాను. దీని తరువాతపిల్ల పెళ్ళికూడా వెంటనే చెయ్యటంనుంచి డబ్బు తేల్చలేకపోయినాను. పదిహేనేళ్ళు పెంచాను; మీచేతుల్లో పెడుతున్నాను మీరూ ఆడపిల్లలుకలవారు. ఇంతకన్న యెక్కువగా మీకు చెప్పనక్కర్లేదు. నామాటయందు నమ్మకముంచి కాస్త గడువిప్పించండి.”

“నేనెవరినయ్యా, గడువిప్పించటానికి! మీరూ మీఅల్లుళ్ళు ఏగంగలో దిగుతారోమధ్య నాకెందుకు? విషయంచెప్పాను. పైవిషయాలు నాకనవసరం” అనిఖూనీకేసు తీర్పుచెప్పిన న్యాయాధికారివలె, వంటింట్లోకివెళ్ళిపోయింది.

ఈమాటతో తండ్రీ కూతుళ్ళిద్దరూ ఖిన్నులై చకితులై ఒకరిముఖాలొకరు చూచుకున్నారు. కమలకు ఎక్కు పుట్టింది. నిరంకుశత్వాన్ని నిరోధించటానికి వలసినంత స్తోమత కలవాడు తన అల్లుడు కాకపోవటంచేతనే ఈవిడ ఈవిధముగా మాట్లాడుతున్నదని కమలతండ్రి గ్రహించాడు. అల్లుడు చదువుకున్నవాడు; ప్రయోజకుడు. పైఅజమాయిషీ చూసేందుకు పెద్దది తల్లి వున్నది. నాబంగారుతల్లికి ఇంకేంకొరత అనుకున్నారు కమల తలిదండ్రులు, సంబంధం కుదుర్చుకునేముందు. పెళ్ళిలోనే కొద్దికొద్దిగా తెలిసొచ్చింది అత్తగారిసంగతి. వేడుకసమయంలో కలిగిన కయ్యాలు ఎల్లకాలంవుండవని అపోహపడ్డారు కమలతల్లిదండ్రులు. తరువాత, తరువాత అత్తగారు ఆడహిట్లరని తెలిసింది. కాని ఇచ్చుకున్నతరువాత తప్పదనుకున్నారు. రెండోపిల్ల పెళ్ళికూడా ఇటీవలచెయ్యటంనుంచి కమల నగల తాలూకు డబ్బు తెమల్చలేక పోయినాడాయన.

“నాన్నా! నాబ్రతుకింతేనా” అని వస్తున్న దుఃఖాన్ని ఆపుకోటానికి నోట్లో పమిటచెంగు కుక్కుకుంది.

“మనసంసారపరిస్థితులు నీకూ తెలుసుకదా తల్లీ; నాలుగునెల్లక్రితమే అమ్మడుపెళ్ళి చేశాం కదా! ఉన్నదంతా దాంతో తుడిచి పెట్టుకుపోయింది. ఈస్థితిలో ఇంతతొందరగా ఆరువందల రూపాయలు ఎక్కడ దొరుకుతాయి? పరిస్థితులింత విషమించాయి కనక ఇంటికెళ్ళినప్పట్నుంచీ ఈ ప్రయత్నం మీదేవుండి అప్పోసొప్పోచేసి నీబాకీతీరుస్తాను. నువ్వుభయపడకు.” అని ఓదార్చాడుతండ్రి.

రాత్రి తొమ్మిదిగంటలకు కమలభర్త ; కేశవరావు వచ్చాడు. ఈ రోజున తనభార్య వస్తుందని తెలుసు కేశవరావుకు. కాని ఆలస్యంగానే వచ్చాడు. మామగారితో ముభావంగా 'ఎప్పుడొచ్చారు?' అన్నాడు. అంతే. మరి మాట్లాడలేదు. తల్లీ కొడుకు లిద్దరూ వంటింట్లో గుసగుసలాడుకున్నారు.

భోజనాలయింతరువాత కమల గదిలోకి వెళ్ళింది. కేశవరావు మంచంమీద వెల్లకిలా పడుకుని పుస్తకం చూస్తున్నాడు. 'వక్కపొడి యిదుగోనండీ' అనిచేతులో పెట్టబోయింది కమల. అతను మాట్లాడలేదు. 'మిమ్మల్నే, వక్కపొడి తీసుకోండి' అన్నదిమళ్ళీ. పలకలేదు. ఆలాగే నిల్చుండి పోయింది, కమల.

భార్యవిషయంలో తల్లిచేసిన ద్వేషపూరితమైన ప్రబోధాలతో నిండి పోయిందా తని మనస్సు. అతను బి.ఏ. అయితే ప్యాసయినాడు; ఉద్యోగమైతే చేస్తున్నాడు; ఇల్లువదిలి బైటకొస్తే అందరితో సరదాగామాట్లాడుతాడు. కాని తల్లిముఖంచూసేసరికి అంకెళ్ళు నొక్కుకుపోతాయి. ఆయింట్లో ఆవిడమాట శాసనం,



కలాంతరం. భార్యతో ఎట్లు వుండాలో, తల్లితో ఎట్లువుండాలో ఈ పదిహేనేళ్ళ చదువులో అతనికెవరూ చెప్పలేదు; స్వయంగా ఆలోచించే అలవాటూ లేదు.

కమల మంచంమీద కూర్చుంది, అతని ముఖంలోకిచూస్తూ. కాని అతనిముఖం ఊర్ధ్వ కోణంలోనేవుంది.

'నామీద ఇంతకోపానికి కారణం చెప్పకూడదా?' ధైర్యంచేసి ఈమాటన్నది.

'ఏమీలేదు, వూరుకో' అన్నాడు విసుగ్గా.

'మరిమాట్లాడరేం' అందిలోపల్లోపల ఉబుకుతున్న దుఖాన్ని పైకివెళ్ళగక్కనీయకుండా అరికట్టి.

'ఏంమాట్లాడాలి! ఏమున్నయిమాట్లాడేందుకు? పడుకో మాట్లాడకుండా' అన్నాడు కోపంగా.

కమల స్తంభించిపోయింది. భార్యాభర్తలసంసార జీవితమంటే ఇదేనా అని అనిపించింది ఆమెకు. తనలో ఆవిర్భూతమైన అంతరాంతరకల్లోలాన్ని తనభర్త అర్థంచేసుకోగలిగివుంటే ఈవిధంగా మాట్లాడడని కమలకు తెలుసు. అత్తగారు ఆవిధంగా ప్రవర్తించి మాట్లాడినా, తల్లియెడల వినయవిధేయతలూ, ఆమెమాట జవదాటరాదనే ఉద్దేశ్యము వున్నప్పటికీ, ఏకాంతంలో కూడా అదేమనస్సుతో వుంటాడని కమల అనుకోలేదు. కాని తనభర్త అన్న ఈమాటలవల్ల పరోక్షంగా కూడా ఆయన మనస్సు తల్లివైపే పరుగెత్తుతూ ఉంటుందని ఇప్పుడు తెలుసుకుంది.

'నగలడబ్బు ఇవ్వలేదనేనా మీకోపం? ఈ మధ్యనే మా అమ్మడిపెళ్ళి చేసినవిషయం మీకు తెలుసుకదా! ఒకటి రెండు నెలల్లో ఏలాగో ఓలాగు తెచ్చిస్తానన్నారు నాన్న. అంతవరకూ ఆగమని ప్రార్థిస్తున్నాను. ఈవిషయంలో కనికరించలేరా!' అని ప్రాధేయపూర్వకంగా అడిగింది.

'నాకేమీ తెలియదు. అంతా అమ్మయిష్టం. ఆమెను సమాధానపరుచు.'

'అత్తగార్ని బ్రతిమాలి సమాధానపర్చుకుంటాను. ఇంకా నాయందేమైనా లోపాలుంటే చెప్పండి; దిద్దుకుంటాను.' అన్నది అదుర్దాగా.

'ఏమీలేవు పడుకో' అని చెయ్యి పుచ్చుకొన్నాడు చిరునవ్వుతో.

ఆమె ఆశించింది లవలేశమైన ఆకాంతిరేఖే. అత్తగార్ని తను సమాధానపర్చుకోగలిగితే, పగలల్లా తల్లికి భయపడి తనతో మాటలాడకపోయినప్పటికీ, ఏకాంతంలో తనభర్త తనను అర్థం చేసుకోగలిగివుంటే ఇటువంటి విషాదసంఘటనలు తప్పుతాయని కమల ఆశించింది. కొన్నిగంటల క్రితం ఆయింటిలో జరిగిన సంఘటనలన్నీ మరచిపోయింది.

తెల్లవారింది. కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత కమల తండ్రి అల్లునితో తను వెళుతున్నాననీ, నగలతాలూకు డబ్బు రెండునెలల్లోగా వడ్డీతో సహా తెచ్చిస్తాననీ, అంతవరకు దయవుంచి ఆగవలసిందనీ అడిగాడు. అల్లుడు కాసేపు ఆలోచించి, అమ్మతోకూడా ఆవిషయమేచెప్పి వెళ్ళండన్నాడు. మళ్ళీ వియ్యపురాలితోకూడా ఈ విషయంచెప్పి, కూతురుతోకూడా చెప్పివెళ్ళాడు కమలతండ్రి.

'పెద్దఇచ్చిచచ్చేవాడిమాదిరిగా వాయిదాలు కూడాను' అన్నది అత్తగారు. నీకయినా సిగ్గులేదూ! మామగారితోనూ, పెళ్ళాంతోనూ అప్పుడే చేతులు కలిపావు. ఇంక నేనొక లెక్కా జమా! నెత్తిననోరుపెట్టుకుని చెప్పా; డబ్బివ్వనిదే పిల్లను తీసుకుని వెళ్ళిపొమ్మని చెప్పమని. నా మాటవింటేగా. నీఆటలూనీపెళ్ళాంఆటలూ సాగుతాయనుకుంటున్నావు కాబోలు; చవటా!' అంటూకొడుకుని ఝాడించింది.

'అత్తయ్యా కోప్పడకండి. ఇదే ఆఖరుగడువు. ఈరెండు నెలల్లోనూ ఇవ్వకపోతే అప్పుడుమీ ఇష్టపకారంచేద్దురుగాని.క్షమించండి.'అందికమల.

'మహాతల్లీ! నిన్నెవరూ మాట్లాడించలేదు. నోరుముయ్యి. ఇంతపొద్దెక్కింది, ఇంకా అంట్లెప్పుడు తోముతావు? వాడిఆఫీసు వేళకువంట కానక్కర్లేదనుకున్నావా లేక ఇరవైనాల్గు గంటలూ వాడితో కులుకుదామనుకున్నావా' అని కోపంతో మంచంమీద కూలబడ్డది.

కొడుకు నోరెత్తలేదు. చొక్కా తొడుక్కొని వెళ్ళిపోయాడు. కమల గుడ్లప్పగించి చూస్తూనిల్చుంది. అకారణంగా తల్లి ఈవిధంగా ఆడిపోసుకుంటూ వుంటే కిక్కురు మనకుండా వెళ్ళిపోయారేమాఅని అనుకుంది కమల. నిరాశ, నిర్లిప్తత ఆమె వదనంలో గాఢంగా అవతరించాయి. బహుళవ్యాప్తమయిన తన అత్తగారి అధికారం యింకముందుకూడా ఇలా

అనిర్వచనీయంగా వుంటుందా లేక పరిస్థితులు చక్కబడి, తనభర్త తనయొక్క వ్యక్తిత్వాన్ని తెలుసుకుని, తల్లి కెంతవిలువ ఇవ్వాలో, భార్య ఎడల ఏవిధంగా ప్రవర్తించాలో గుర్తెరిగి ఇరువురి మనస్సునూ కష్టపెట్టకుండా వుండగల వాడా అనే ప్రశ్నకు సమాధానం ఆమెకు తోచలేదు.

మరి నాలుగు రోజులు అత్తగారి దూషణ తిరస్కారాలతో కమల కాలంగడిపింది. ఆరాత్రి గదిలో భర్తను అడిగింది దుఃఖాన్ని ఆపుకోలేక:

'నిజంగా తప్పులున్న వార్ని తిట్టినా కొట్టినా మనస్సుకు కష్టం కలుగదు. అట్లాగాక ఏవిధంగానయినా హింసించాలి, తిట్టాలి, తిరస్కరించాలి, అనే ఉద్దేశంతో వుంటుంటే ప్రతి విషయంలోనూఅనేక తప్పులు కనిపిస్తాయి. ఇంక నాజీవితం ఈవిధంగా గడిచి పోవలసిందేనా?' అన్నది.

నిజమైన పుణ్యశీలత్వానికి రుజువు కరుణార్ద్ర హృదయం. అదిలేకపోగా ఆతల్లికి కొడుకవటం చేత కాఠిన్యం, సంకుచితత్వం, నిరాదరణమైన వైఖరి కేశవరావులోకూడా వున్నాయి. వీటికి కారణం, మనిషిని అర్థం చేసుకోవటం అతనికి తెలియక పోవటమే. తన జీవితంలో భార్య విలువ యెటువంటిదో, తామిద్దరికీగల అవినాభావసంబంధం ఎటువంటిదో, మానాభిమానాలుగల సున్నిత హృదయాలను గాయపర్చినందువల్ల వారి మనస్సు ఎంతక్షోభిల్లుతుందో అతనికి తెలియదు. అతనిదృక్పథంలోగోచరించేదల్లాతనతల్లిమాత్రమే

'మాటలాడరేం! కోపమొచ్చిందా?'

'నోరుముయ్యి. మాఅమ్మ ఏమన్నా పడవలసిందే. తిట్టినా, కొట్టినా, తిరస్కరించినా అనుభవించవలసిందే. నీయందు తప్పున్నదో లేదో నాకు అనవసరం. ఆమెను విమర్శించేందుకు నీకు అధికారంలేదు. కేవలం ఒక్క నగల డబ్బు విషయంలోనేకాదు. నీయందు ఆమెకు ఇటువంటి అభిప్రాయమేవుంది. నీకు ఇష్టంలేకపోతే మీవాళ్ళింటికి శాశ్వతంగా వెళ్ళిపోవచ్చు. నిన్నిక్కడ వుండమని నేనేమీ బ్రతిమాలటంలేదు. అమ్మకు ఇష్టంలేని నువ్వు నాకుమాత్రం ఇష్టమా? ఎన్నిటికీ కాదు. ఆమెఇష్టమే నాఇష్టం' అని వెనక్కు తిరిగి పడుకున్నాడు.

తన ఆశాజ్యోతి ఆరకుండా వుండాలని ఎంత ప్రయత్నించినా ఆమెకు సాధ్యపడలేదు. మిణుకుమిణుకుమంటున్న ఆజ్యోతిఇప్పుడు పూర్తిగా ఆరిపోయింది. మళ్ళీ దాన్ని వెలిగించి ఆరకుండా చేసుకోగల స్తోమత అసున్నితహృదయంలోలేదు. ఒకవేళవున్నప్పటికీఒక్కవ్యక్తియొక్క మనోభావాలను మార్చటానికి వీలవుతుందిగాని ఇంట్లో వారందరి మనస్సులూ మార్చటానికి ఎవ్వరి తరమూకాదు. నిరాదరణకూ, తిరస్కరణకు, కాఠిన్యానికి నిలయమై కరుడుగట్టిన హృదయాలను ద్రవింపజేసి వారిని ప్రసన్నుల్ని చేసుకోవటం ఎంత ప్రయత్నించినా ఆమెకు చేతకాని పని అయింది. ఒక్కసారి కళ్ళుమూసి తన చిన్నప్పట్నుంచి జరిగిన తన జీవిత విషయాలను తల్చుకున్నది.

తల్లిఅనేమాటలకు సమాధానం ఇవ్వగలిగేశక్తి అతనికి లేకపోయినప్పటికీ, కనీసం పడకగదిలోనయినా, తనతోఆప్యాయంగా మాటలాడుతూ, కొన్నాళ్లుకష్టాలను ఓర్చుకోవాలని బుజ్జగించిచెప్పి, తనహృదయాన్ని అర్థంచేసుకుని, నిరాశపడవద్దని హెచ్చరించి చేయూతనిచ్చినట్లయితేకొంతవరకు మనస్సుకి ఊరటగా ఉండేది. తననుండి తనభర్త ఏమీ ఆశించటంలేదని మనస్సు ధృడపర్చుకున్నప్పుడు వచ్చిన సమాధానం ఆమె స్వాభిమానాన్ని బాగా గాయపరిచింది. తన భర్తలో మానవత్వం ఏమయినా వున్నదేమోనని అనేక విధాల ప్రయత్నించి చూసినప్పటికీ, మానవత్వం లేకపోగా, తన అత్తగారిలోమాదిరిగా రాక్షసత్వం బయటపడేసరికి తనకిక ఈప్రపంచంలో తావులేదని గ్రహించింది. పైగా ఈరోజున గట్టిగా చెప్పాడు, 'ఇష్టముంటే వుండు లేకపోతే శాశ్వతంగా వెళ్ళిపో' అని. క్షణ క్షణమూ ఆ మాట స్మరించింది. కళ్లు తమాషాగా ఒక్కసారి మెరిశాయి. అతను నిద్రపోతున్నాడు. మెల్లిగా పక్కమీదనుంచి లేచింది. ఆ కాళరాత్రిని నిశ్శబ్దవాతావరణాన్ని చీల్చుకుంటూ ముందుకు సాగిపోయింది. విరక్తితోకూడిన చిరునవ్వుతో గోదావరీమతల్లిని సాభిమానపూర్వకంగా పలకరించింది. తన కొరతను గోదావరి శాశ్వతంగా తీర్చకలదనుకుంది. గౌతమీనది జాలిగా ఆమెను తన గర్భంలోకి తీసుకుంది.